ఉక్రేనియన్ జానపద గాథలు - 1

# పెంపుడు తండ్రి



ఉక్రేనియన్ జానపద గాథలు - 1

# పెంపుడు తండ్రి

అనువాదం : ఆర్వీయార్

మంచి పుస్తకం

Ukrainian Folk Tales

**ఉక్రేనియన్ జానపద గాథలు - 1**

# పెంపుడు తండ్రి

అనువాదం : ఆర్వీయార్

బొమ్మలు : వి. గొర్దియ్‌చుక్

"రాదుగ" ప్రచురణాలయం ద్వారా 1988లో సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ప్రచురణ : ఆగస్టు, 2011

ప్రతుల సంఖ్య : 3000

వెల : రూ. 22/-

ISBN : 978-93-80153-56-8

ప్రచురణ, ప్రతులకు :

**మంచి పుస్తకం**

12-13-439, వీధి నెం. 1

తార్నాక, సికింద్రాబాదు - 500 017

ఫోన్ : 94907 46614.

email : info @ manchipustakam.in

website : www.manchipustakam.in

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

1-9-1126/బి, అజామాబాద్,

హైదరాబాదు - 500 020.

ఫోన్ : 040 - 2767 8411


# కథా క్రమం


| | | | |
|---|---|---|---|
| 1. | హంస, రొయ్య, చేప | . . . . . | 05 |
| 2. | సిర్కో | . . . . . | 08 |
| 3. | శ్రీమాన్ మార్జాలం | . . . . . | 12 |
| 4. | పిల్లీ, కోడిపుంజు | . . . . . | 16 |
| 5. | తారు వీపు చిన్న గడ్డి ఎద్దు | . . . . . | 20 |
| 6. | ఆశపోతు అవ్వ | . . . . . | 24 |
| 7. | పెంపుడు తండ్రి | . . . . . | 28 |

అద్భుత లోకం గురించీ, ఆ లోకంలోని వీరుల గురించీ చెప్పే కమనీయ జానపద గాథలు ఒక తరాన్నించీ ఇంకో తరానికి ఏనాటినుంచో అందుతూనే ఉన్నాయి. లోకుల యుక్తి, చమత్కారం, హాస్యం తొణికిసలాడే గాథలు ఇవి. చాలా కాలం అవి మౌఖికంగానే ఉండిపోయాయి. శ్రోతలకి వాటిని వినిపించేవారు. అందుకనే వాటికి గాథలని పేరు వచ్చింది.

ఉక్రేనియన్ జానపద గాథలు అపారంగా ఉన్నాయి. పాతకాలం నాటి వీరుల్నీ, సంఘటనల్నీ ఈ గాథల్లో అడుగు అడుగునా మనం చూస్తాం. సామాన్య ప్రజలలో ధైర్యం ఉన్న మనుషులూ, ఉల్లాసం కలిగించే సాహసకృత్యాలు, చలాకీగా ఉండే జంతువులూ, పక్షులు పాఠకులకి సంతోషం కలిగిస్తాయి.

ప్రకృతి గురించీ, పెంపుడు జంతువుల గురించీ, అడవి జంతువుల గురించీ, పక్షుల గురించీ ప్రాథమిక జ్ఞానాన్ని జానపద గాథలు పిల్లలకి అందిస్తాయి.



# హంస, రొయ్య, చేప

ఒకసారి ఒక హంస నదిలో తీరంవెంట ఈదుతోంది. అది నీళ్లల్లోకి మెడ పెట్టి చూసింది. దానికి ఒక చేప కనిపించింది. చేప ఆగి హంసని అడిగింది:

"నది శీతకట్టులో గడ్డ కట్టినప్పుడు నువ్వెక్కడికి వెళతావో చెప్పవా?"

"నీకెందుకు ఆ గొడవ," అంది హంస.

"నేను కూడా వద్దామని. నీళ్లు గడ్డకట్టినప్పుడు లోపల నాకు గాలి రాక ఉక్కిరిబిక్కిరి అవుతోంది," అంది చేప.

"నేను వేడిగా ఉండే చోటికి వెళతాను. వసంత కాలం దాకా అక్కడ ఉంటాను," అంది హంస.

"నన్నూ తీసికెళ్లు నీతో," అంది చేప.

"దానికేం! అలాగే! ఇద్దరం కలిసి ఆడుతూ పాడుతూ వెళ్లొచ్చు," అంది హంస.

ఈ మాటలు ఒక రొయ్య వింది.

"నన్నూ తీసికెళ్లండర్రా, మీకు పుణ్యం ఉంటుంది," అంది.

"అలాగే. అందరం కలిసి వెళదాం సరదాగా. ఆకురాలే కాలం రాగానే చెప్తాను ఎప్పుడు బయలుదేరాలో ఏమిటో," అంది హంస.

అవి నీటిలో ఈదుతున్నాయి కాబట్టి గాలిలో ఎగరగలవులే అనుకొంది హంస, పాపం!

వేసవి వెళ్లిపోయింది, ఆకురాలే కాలం వచ్చింది. అప్పుడు హంస నది దగ్గరికి వెళ్లింది.

"నేస్తాలూ, వెచ్చగా ఉండే చోటికి వెళ్లే వేళ అయింది. తయారుగా ఉండండి. రేపు మధ్యాహ్నం భోజనాలయాక వస్తాను," అని చెప్పింది.



చేప ఈ సంగతి రొయ్యతో చెప్పింది. రొయ్య ఆలోచించి చెప్పింది:

"మనం దారిలో ఏం తింటాం? ఏదన్నా పట్టుకెళదాం. ప్రయాణంలో తినడానికి ఉంటుంది."

"ఎలా పట్టుకెళతాం?"

"ఒక బండి చూసి అందులో వేద్దాం. తాళ్లు కట్టి లాక్కు వెళదాం," అంది రొయ్య.

రొయ్య బండిని తెచ్చింది. లాగడానికి గడ్డితో ఎంటు పేని కట్టింది. హంస మర్నాడు వచ్చింది.

"ఏం తయారయారా? నేను ఎగురుతా యిక," అంది.

"అయిపోయింది, అయిపోయింది ఒక్క క్షణం. ఈ తాడు నువ్వు పట్టుకో. అందరం కలిసి బండిని లాగుదాం," అంది రొయ్య.


"సరే, కాలికి కట్టండి," అంది హంస.

రొయ్య హంస కాలికి తాటిని కట్టింది. తను ముందు కోరలకి కట్టుకుంది. మూడో తాటిని చేప పంటితో పట్టుకుంది.

అలా అవి బండిని లాగాయి.

రొయ్య వెనక్కి లాగింది. చేప ముందుకు నీళ్ళల్లోకి లాగింది. హంస పైకి ఎగిరి లాగింది. దాంతో తాళ్ళు టపామని తెగిపోయి, బండి ఎక్కడిదక్కడే ఉండిపోయింది. అది చూసి కప్పలు బెకబెకా నవ్వాయి. ఎందుకొచ్చిన చేతకాని పనులు, దాన్ని తలకి ఎక్కించుకోవడం అని రొయ్యనీ, చేపనీ చూసి కప్పలు పొట్టలు చెక్కలయేట్టు నవ్వుకున్నాయి.





# సిర్కో

పూర్వం ఒకాయన ఉండేవాడు. ఆయనకి ఒక కుక్క ఉండేది. దాని పేరు సిర్కో. అది చాలా చాలా ముసలిది. ఒక రోజున యజమాని దాన్ని బయటికి గెంటేశాడు. పొలాల్లో దారీతెన్నూ లేకుండా సిర్కో తిరిగింది. దాని దురదృష్టానికి విచారించి ఎంతో ఏడ్చింది.

'ఎన్నో ఏళ్లు యజమానికి సేవ చేసి, ఆయన ఇల్లు కాపలా కాశాను. ఇప్పుడు ముసలిదాన్ని అయిపోయాను. శక్తి ఉడిగిపోయింది. అందుకని నాకు ఎంగిలి మెతుకులు వెయ్యడానికి కూడా ఆయనకి మనసు పుట్టడం లేదు, ఇంట్లోంచి నన్ను తరిమేశాడు,' అనుకొంది.

అది ఇలా అనుకుంటూ తిరుగుతూ ఉండగా దాని దగ్గరికి ఒక తోడేలు వచ్చింది. "ఎందుకు అలా తిరుగుతున్నావు?" అని తోడేలు అడిగింది.

"మా యజమాని నన్ను ఇంట్లోంచి తరిమేశాడు," అంది సిర్కో.

"కావాలంటే నీకు సాయం చేస్తాను. నేను చెప్పినట్టు చేస్తే నీ యజమాని నిన్ను మళ్లీ ఇంట్లోకి రానిస్తాడు," అంది తోడేలు.

"బాబ్బాబు! నీ పేరు చెప్పుకుంటాను. ఆ మాత్రం సాయం చేస్తే నీ రుణం ఉంచుకోను," అంది సిర్కో.

"ఊఁ, అయితే విను! త్వరలోనే మీ యజమానీ, యజమానురాలూ పంట కోతకి వెళతారు. మీ యజమానురాలు తన బిడ్డని ఒక గడ్డిమోపు పక్కన పడుకోబెడుతుంది. నువ్వు బిడ్డకి దగ్గరగా ఉండాలి సుమా, మరి నాకు తెలియాలికదా బిడ్డ ఎక్కడుందో. అప్పుడు నేను పరిగెత్తుకుంటూ వచ్చి బిడ్డని ఎత్తుకుపోతా. నువ్వు నా వెనకాలే పరిగెత్తుకుంటూ రావాలి, బిడ్డని నానుంచి విడిపించి



తీసుకుపోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు నేను భయపడినట్టు నాటకం ఆడతా. తరవాత బిడ్డని ఒదిలేస్తా," అంది తోడేలు.

గోధుమ పంటని కోసే సమయం వచ్చింది. యజమానీ, ఆయన భార్యా పొలంలోకి వెళ్ళారు. ఆమె బిడ్డని గడ్డిమోపు పక్కన పడుకోపెట్టింది. తరవాత అతడితోపాటు పనిలోకి దిగింది. కాసేపటికే తోడేలు పరిగెత్తుకుంటూ వచ్చింది. బిడ్డని దొరికించుకుని పొలానికి అడ్డంపడి పరిగెత్తడం మొదలుపెట్టింది. సిర్కో పరిగెత్తుతూ తోడేలుని వెంబడించింది.

"సిర్కో దాన్ని పట్టుకో," అని యజమాని అరిచాడు.

సిర్కో తోడేలుని చేరుకుని దాని దగ్గరనుంచి బిడ్డని విడిపించి యజమాని దగ్గరకి తీసుకువచ్చింది. యజమాని సంచిలోనుంచి పంది మాంసం ముక్క తీసి దానికి పెట్టాడు.

"ఇదిగో సిర్కో! కడుపునిండా తిను! బిడ్డను కాపాడావు. మంచి దానివి!" అన్నాడు.

సాయంత్రం అయాక యజమానీ, ఆయన భార్య ఇంటికి వెళ్ళారు. సిర్కోని తమతో ఇంటికి తీసుకెళ్లారు.

"ఇంకొంచెం ఎక్కువ మాంసం కుడుములు చెయ్యి. కొవ్వు మిగల్చొద్దు," అని యజమాని చెప్పాడు.

మాంసం కుడుములు తయారయ్యాయి. సిర్కోని పక్కన కూర్చోబెట్టుకున్నాడు యజమాని.

"ఊఁ, మాంసం కుడుములు వడ్డించు. భోజనం చేద్దాం," అని భార్యతో చెప్పాడు యజమాని.

ఆవిడ మాంసం కుడుముల్ని బల్ల మీద పెట్టింది. యజమాని వాటిని ఒక కంచంనిండా పెట్టి సిర్కోకి తినమని ఇచ్చాడు. వేడిగా ఉన్నాయి, పాపం దాని నోరు కాలుతుందని తనే ఊది చల్లార్చాడు.

'ఇదంతా ఆ తోడేలు చలవ! దాని రుణం తీర్చుకోవాలి,' అనుకొంది సిర్కో.

ఇంతలో చెల్లెలు పెళ్లికి లగ్నం పెట్టుకున్నాడు యజమాని.

సిర్కో పొలాల్లోకి వెళ్లి తోడేలు కోసం వెతికింది.

"ఆదివారం సాయంత్రం వేళకి మా కాయగూరల తోటలోకి రా. నేను నిన్ను ఇంట్లోకి తీసికెళతాను. నువ్వు నాకు చేసిన ఉపకారానికి బదులు తీర్చుకుంటాను," అంది.

తోడేలు ఆదివారం కోసం ఎదురు చూసింది. అప్పుడు సిర్కో చెప్పిన చోటుకి వెళ్లింది.

ఆ రోజే పెళ్లి జరిగింది. సిర్కో బయటికి వెళ్లి తోడేలుని ఇంట్లోకి తీసుకొచ్చి ఒక బల్ల కింద దాక్కోమంది. బల్లమీద నుంచి ఒక పెద్ద ఓద్కా సీసానీ, పెద్ద మాంసం ముక్కనీ అందుకుని తోడేలుకి పెట్టింది. వచ్చిన చుట్టాలు సిర్కోని కొడదామనుకున్నారు. కాని యజమాని వారించాడు.

“దాన్ని ముట్టుకోకండి! అది మాకు చాలా ఉపకారం చేసింది. దాని పట్ల ఎప్పటికీ కనికరం చూపిస్తూనే ఉంటాను,” అన్నాడు యజమాని.

సిర్కో మంచి మంచి మాంసం ముక్కలు ఏరి తోడేలుకి పెట్టింది. ఎంత చక్కటి విందు తినిపించిందంటే బాగా తాగేసిన తోడేలు ఉండబట్టలేక పోయింది.

“నేను పాట పాడతా,” అంది.

“అమ్మమ్మో! వద్దు! చిక్కుల్లో పడతావు. మెదలకుండా ఉంటానంటే, నీకు ఇంకొంచెం ఓద్కా ఇస్తాను,” అని సిర్కో బతిమిలాడింది.

అది తోడేలుకి ఇంకో సీసా ఓద్కా ఇచ్చింది. తోడేలు దాన్ని దెబ్బకి ఖాళీ చేసేసింది.

తోడేలు మళ్లీ “అబ్బ! ఉండలేక పోతున్నాను. ఏమైనాగానీ పాడేస్తా,” అంది. బల్ల కిందనుంచి చెవులు చిల్లులు పడేట్టు అరుపు లంకించుకుంది.

చుట్టాలు భయపడిపోయి గెంతారు. ఇటూ అటూ పారిపోయారు. కొంతమంది తోడేల్ని చితగ్గొడదామనుకున్నారు. అప్పుడు సిర్కో దాన్ని చంపేసే దానిలాగా, దానిమీదకి ఉరికింది.

“తోడేల్ని ఏం చెయ్యకండి! సిర్కోకి దెబ్బ తగలొచ్చు! మరేం భయపడకండి, సిర్కో దానికి గుణపాఠం చెపుతుంది,” అన్నాడు యజమాని.

తోడేల్ని పొలంలోకి తీసికెళ్లింది సిర్కో.

“నువ్వు నాకోసారి సాయం చేశావు. బదులు తీర్చుకున్నా,” అని చెప్పింది.

అవి సెలవు తీసుకుని తమ దారిన వెళ్లిపోయాయి.



# శ్రీమాన్ మార్జాలం

ఒకప్పుడు ఒకాయన దగ్గర ఒక పిల్లి ఉండేది. అది బాగా ముసలిది అయిపోయి ఎలుకల్ని కూడా పట్టలేకపోయేది.

'ఈ ముసలి పిల్లితో ఏం చెయ్యను నేను? తిండి దండగ. అడవిలోకి తీసుకుపోయి వదిలేస్తాను, దాని దారి అది చూసుకుంటుంది,' అనుకున్నాడు అతను.

అప్పుడా పిల్లిని తీసికెళ్లి అడవిలో వదిలేశాడు.

అది ఒక చెట్టుకింద ఏడుస్తూ కూర్చుంది. అప్పుడు ఒక నక్క పరిగెత్తుకుంటూ వచ్చి పిల్లిని చూసింది.

"ఎవరు మీరు?" అని అడిగింది.

"నేను శ్రీమాన్ మార్జాల శేఖరుణ్ణి," అని పిల్లి జవాబు చెప్పింది.

అంత ఘనమైన పరిచయం అయినందుకు నక్కకి సంతోషం కలిగింది. "మనం పెళ్లి చేసుకుందాం," అంది నక్క.

"సరే," అని నక్కని పెళ్లాడ్డానికి పిల్లి ఒప్పుకుంది. నక్క తన ఇంటికి పిల్లిని తీసుకుని వెళ్లింది.

పిల్లిని సంతోషపెట్టాలని నక్క నానా తంటాలూ పడేది. కోడిపెట్టని పట్టుకుంటే ముందు దానికి పెట్టేది, అది తినేది కాదు.

ఒక రోజున నక్కకి ఒక కుందేలు కలిసింది.

"నిన్ను స్వయంగా చూడాలని మీ ఇంటికి వద్దామనుకుంటున్నా నక్క చెల్లీ," అంది కుందేలు.

"వద్దు వద్దు. మా ఇంట్లో శ్రీమాన్ మార్జాలం ఉంటున్నాడు. నిన్ను బరికి చంపేస్తాడేమో, రావద్దు," అంది నక్క.



అప్పుడు పిల్లి భీకరమైన వేషం వేసుకుని ఇవతలికి వచ్చి మ్యావ్ అంటూ గుర్రుమంది.

కుందేలు పారిపోయి ఈ విషయం తోడేలు, ఎలుగుబంటి, అడవి పందికి చెప్పింది. దాంతో అవన్నీ కలిసి శ్రీమాన్ మార్జాలాన్ని ఎలా కలవాలా అని ఆలోచన చేశాయి.

"పిల్లిని భోజనానికి రమ్మని పిలుద్దాం," అని అవి అనుకున్నాయి. ఏం వంటకాలు చేయాలా అని చర్చించుకున్నాయి.

"నేను వెళ్ళి పులుసులోకి మాంసం తెస్తాను," అంది తోడేలు.

"నేను బంగాళా దుంపలూ, బీట్‌రూట్ దుంపలూ తెస్తాను," అంది అడవి పంది.

"ఆఖర్న తినడానికి నేను తేనె తెస్తాను," అంది ఎలుగు.

క్యాబేజీ తేవడానికి కుందేలు వెళ్లింది.

ఇవన్నీ తెచ్చి వంట మొదలుపెట్టాయి. అంతా తయారయ్యాక నక్కనీ, శ్రీమాన్ మార్జాలాన్ని ఎవరు పిలవాలా అనే విషయం తేలలేదు.

"నేను పరిగెత్తి పోవాల్సి వస్తే ఏం చెయ్యగలను? చచ్చినా నావల్ల కాదు," అంది ఎలుగు.

"నేను ఎడ్డిమడ్డిగా ఉంటాను," అంది అడవి పంది.

"నేను ముసలిదాన్ని, పైగా ఒంట్లో అంత బాగానూ లేదు నాకు," అంది తోడేలు. దాంతో కుందేలు మిగిలి పోయింది.

అది ఒక్క పరుగున నక్క ఇంటికి వెళ్లింది. కిటికీమీద మూడుసార్లు టక్ టక్ టక్‌మని కొట్టింది.

"ఏం వచ్చావ్?" అని నక్క అడిగింది.

"నక్కా! నిన్నూ, శ్రీమాన్ మార్జాలాన్నీ భోజనానికి రమ్మని తోడేలు, ఎలుగుబంటి, అడవి పంది, నేను పిలుస్తున్నాం," అంది కుందేలు.

"బాగుంది, నేను వస్తాను. శ్రీమాన్ మార్జాలం కూడా నాతో వస్తారు. కాని మీరు నలుగురూ దాక్కోవాలి. లేకపోతే మార్జాలం మిమ్మల్ని గీకి చంపెయ్యొచ్చు," అంది.

కుందేలు వెనక్కి తిరిగివెళ్లి తన నేస్తాలకి ఈ విషయం చెప్పింది. అవి ఎంత భయపడి పోయాయో చెప్పలేం. ఎలుగుబంటి చెట్టు ఎక్కేసింది. తోడేలు ఒక పొద వెనకాల నక్కింది. కుందేలు పొద కింద దాక్కుంది. అడవి పంది గుబురు పొదల వెనక దాక్కుంది.

తరవాత శ్రీమాన్ మార్జాలంతో కలిసి నక్క వచ్చింది. అది పిల్లిని భోజనాల బల్ల దగ్గరికి

తీసుకువెళ్లింది. మాంసం చూడగానే పిల్లికి పండగ వచ్చినట్టు అనిపించింది. “మ్, మ్, మ్, మ్యావ్,” అంది. పెట్టిన వంటకాలు పిల్లికి చాలలేదని జంతువులు భయపడ్డాయి.

“ఇంత భయంకరమైన జంతువుని ఎన్నడన్నా ఎరుగుదుమా! ఏదీ దీనికి చాలేటట్టు లేదు. ఈ లెక్కన చూస్తే ఇది మనల్ని కూడా భోంచేసేస్తుంది,” అని ఆ నాలుగూ అనుకున్నాయి.

శ్రీమాన్ మార్జాలం బల్లమీదకి ఎక్కి భోజనం మెక్కడం మొదలుపెట్టింది. కడుపు నిండిన తర్వాత లుంగ చుట్టుకుని గాఢంగా నిద్రపోయింది.

అడవి పంది దగ్గర్లోనే గుబురు పొదల వెనకాల తోక బయటికి పెట్టి దాక్కుంది. ఒక దోమ ఎగురుకుంటూ వచ్చి టక్కున దాన్ని కుట్టింది. తట్టుకోలేక అడవి పంది తోక మెలి తిప్పుకుంది. శ్రీమాన్ మార్జాలం అది ఎలక అనుకుని లటక్కున పళ్లతో పట్టుకుంది.

అడివి పందిని చూసి శ్రీమాన్ మార్జాలం ఎలుగుబంటి కూర్చున్న చెట్టుమీదకి గెంతింది. దీన్ని చూసి ఎలుగుబంటి ఇంకా ఎత్తుకి ఎక్కింది. కాని దాని బరువుకి కొమ్మలు విరిగి పోయాయి. అది సర్రున తోడేలు వీపుమీద పడింది. తోడేలు దాదాపు అప్పడం అయిపోయింది. ఆ రెండూ ఒక్క గెంతు గెంతి పరుగో పరుగు. ఇక కుందేలు కూడా వాటి వెనకాల ఎంతలా పరుగు తీసిందంటే దాని కాళ్లు ఎక్కడికి తీసుకుపోతున్నదీ దానికే తెలీదు.

ఆ నాలుగూ కొంచెం సేపయిన తర్వాత మళ్లీ కలుసుకుని అసలేం జరిగిందీ అని మాట్లాడుకున్నాయి.

“శ్రీమాన్ మార్జాలం చిన్నదే కాని మనల్ని నలుగుర్నీ తినేసినంత పని చేసింది,” అనుకున్నాయి.





# పిల్లీ, కోడిపుంజు

అనగా అనగా ఒక పిల్లి, కోడిపుంజూ ఉండేవి. అవి చాలా స్నేహంగా ఉండేవి. పిల్లి ఫిడేలు వాయిస్తే, కోడిపుంజు పాట పాడేది. ఇద్దరికీ ఆహారం తేవడానికి పిల్లి వెళ్లేది. కోడిపుంజు ఇల్లు చూసుకునేది.

ఇల్లు వదిలి వెళ్లేటప్పుడల్లా, "ఇంట్లోకి ఎవరినీ రానివ్వకేం, పుంజూ. నిన్ను ఎవరు పిలిచినా సరే బయటికి వెళ్లొద్దు," అని కోడిపుంజుతో పిల్లి చెప్పేది.

"నే వెళ్లను, ఎవరినీ రానివ్వను. నువ్వేం బెంగ పెట్టుకోకు," అని కోడిపుంజు జవాబు చెప్పేది. అది ఇంట్లోకి వెళ్లిపోయి పిల్లి తిరిగి వచ్చేదాకా లోపలే ఉండి పోయేది.

కోడిపుంజుని ఒక నక్క చూసింది. దాన్ని బయటికి రప్పించాలనీ, పట్టుకోవాలనీ అనుకొంది. పిల్లి ఇంట్లో లేని వేళ చూసి కిటికీ మీదకి ఎక్కింది.

"బయటకి రా, పుంజూ! నీకు కాసిని గోధుమ గింజలు ఇస్తాను. తియ్యని మంచినీళ్లు ఇస్తాను," అంది.

కాని నక్కకి కోడిపుంజు ఇలా జవాబు చెప్పింది:

"నాకు అక్కర్లేదు కొక్కొరొకో!

బయటికి పోనని పిల్లికి చెప్పాను."

నక్క ఇలా లాభం లేదనుకుంది. దాంతో ఒక రోజు రాత్రి ఆ ఇంటి దగ్గరికి వెళ్లి కాసిని గోధుమ గింజలు కిటికీ కింద పోసింది. కోడిపుంజు ఏం చేస్తుందో చూద్దామని అది పొదమాటున నక్కింది.



పిల్లి మామూలుగా వేటకి వెళ్లింది. కోడిపుంజు తలుపు తీసి చూసింది. చుట్టుపక్కల ఎవరూ కనిపించలేదు. కాని నేలమీద తియ్యని గోధుమ గింజలు చెదిరి ఉన్నాయి. వాటిని తినాలని దానికి కోరిక పుట్టింది.

'బయటికి వెళ్లి కాసిని గింజలు పొడిచి తింటాను. చుట్టుపక్కల ఎవరూ లేరు. పిల్లికి ఎవరూ చెప్పరు,' అనుకొంది.

కాని గడప దాటిందో లేదో కోడిపుంజు మీదకి నక్క దూకి మెడ పట్టుకుని దాని ఇంటికి పారిపోయింది. కోడిపుంజు పిల్లిని పిలిచింది:

"పిల్లి అన్నా కాపాడు నన్ను,
ఎత్తుకు పోతోంది నక్క నన్ను
దారీతెన్నూ తెలియకుండా
అడ్డం వస్తోంది దీని తోక.
నేస్తం, నువ్వు రాకపోతే
నా పని అంతే, ముగిసిందీ!"

పిల్లేమో చాలా దూరంలో ఉంది. అందుకే కోడిపుంజు మొర దానికి వినిపించలేదు. అది ఇంటికి వచ్చి చూస్తే కోడిపుంజు లేదు. ఇక చేసేది లేక భోరుభోరున ఏడ్చింది. కాని తర్వాత దానికి ఒక ఆలోచన తట్టింది. తన ఫిడేలూ, బాగా నదురైన బొమ్మ ఉన్న సంచీ తీసుకుని నక్క ఇంటికి బయలుదేరింది.

నక్కకి నలుగురు కూతుళ్లూ, ఒక కొడుకూ ఉన్నారు. ఆ రోజు వేటకి వెళ్లే ముందు కోడిపుంజుమీద ఒక కన్నేసి ఉంచమని అది పిల్లలకి చెప్పింది. ఒక కడవ నీళ్లు కాయమని పురమాయించింది. ఇంటికి తిరిగి రాగానే పుంజుని చంపి వంట వండుకోవచ్చునని అంది.

"జాగ్రత్త! నేను ఇంట్లో లేనప్పుడు ఎవరినీ లోపలికి రానివ్వకండి," అని హెచ్చరించింది.

నక్క వెళ్లిపోయింది. అప్పుడు పిల్లి దాని ఇంటికి వెళ్లింది. కిటికీ కింద నుంచుని ఫిడేలు వాయిస్తూ పాట పాడడం మొదలుపెట్టింది:

"పెద్దదీ, బారుదీ నక్కమ్మ ఇల్లు
నలుగురూ కూతుళ్లు చక్కనైనోళ్లు
ఫిలిప్కో ఒక్కడే నక్కమ్మ కొడుకు
చూడ వేడుక గొలుపు చక్కనైనోడు

బయటికి రండి పిల్లలందరూ

ఇంకో పాట నేను పాడ విందురూ!"

నక్కమ్మ పెద్ద కూతురు ఇది విని బయటికి వెళ్లి ఆ వాయించేది ఎవరో ఏమిటో చూద్దామనుకుంది.

"మీరు ఇంట్లో ఉండండి నేను వెళ్లి చూసి వస్తా. అంత బాగా వాయించే వాళ్లెవరో," అని చెప్పింది.

అది ఇంట్లోనుంచి బయటికి రాగానే పిల్లి దాన్ని ముక్కుమీద కొట్టి లటక్కన సంచిలో పెట్టేసింది. మళ్లీ పాడడం మొదలుపెట్టింది:

"పెద్దదీ బారుదీ నక్కమ్మ ఇల్లు

నలుగురూ కూతుళ్లు చక్కనైనోళ్లు

ఫిలిప్కో ఒక్కడే నక్కమ్మ కొడుకు

చూడ వేడుకగొలుపు చక్కనైనోడు

బయటికి రండి పిల్లలందరూ

ఇంకో పాట నేను పాడ విందురూ!"

నక్క రెండో కూతురు ఆ వాయించేదెవరో చూద్దామని బయటికి వెళ్లింది. పిల్లి దాని ముక్కుమీద కొట్టి సంచిలోకి తోసేసింది. మిగతా ఇద్దరు కూతుళ్లకీ అంతే అయింది.

వాళ్ల తమ్ముడొక్కడూ ఇంట్లో ఉండిపోయాడు. అక్కల కోసం చాలాసేపు చూశాడు, వాళ్లు రాలేదు.

'నేను వెళ్లి వాళ్లని తీసుకురావాలి. లేకపోతే అమ్మ వచ్చి నా తాట ఒలుస్తుంది,' అనుకున్నాడు.

నక్క కొడుకు బయటికి అడుగు పెట్టగానే ముక్కుమీద కొట్టి సంచిలో కుక్కేసింది పిల్లి.

తర్వాత సంచిని ఎండిపోయిన విల్లో చెట్టు కొమ్మకి కట్టి ఇంట్లోకి వెళ్లింది. కోడిపుంజు ఎక్కడుందో వెతికి పట్టుకుని దాన్ని కట్టిన తాడు విప్పింది. అప్పుడు పుంజూ, పిల్లీ నక్క వండుకున్న అన్నం అంతా తినేసి, కాగుతూ ఉండే నీళ్ల కడవని బోర్ల పడదోశాయి. ఇంట్లో ఉన్న ముంత మూకుళ్లన్నిటినీ బద్దలు కొట్టేశాయి. తరవాత వాటి ఇంటికి పారిపోయాయి.

ఆ నాటినుంచీ పిల్లి మాట కోడిపుంజు జవదాటలేదు.





# తారు వీపు చిన్న గడ్డి ఎద్దు

ఒకప్పుడు ఒక ముసలి తాతా, ముసలి అవ్వా ఉండేవాళ్లు. ముసలి తాత పని కోసం వెళ్లేవాడు. జీవనాధారం కోసం తారు తయారు చేసేవాడు. ముసలవ్వ ఇంటి దగ్గరే నూలు వడుకుతూ ఉండేది.

ముసలవ్వ ఒక రోజు, చిరచిరలాడిపోతూ ఆందోళనగా ముసలి తాతతో "నాకు గడ్డితో ఒక చిన్న ఎద్దు చేసి దానికి తారు కూడా పూసి ఇయ్యి," అంది.

"నీకు గడ్డి ఎద్దు ఎందుకు?" అన్నాడు తాత.

"దాన్ని మేపుతాను," అంది అవ్వ.

ముసలి తాత చిన్న గడ్డి ఎద్దుని తయారు చేశాడు. దాని రెండు పక్కలా, వీపు మీదా తారు పూశాడు.

మరునాడు ఉదయం అవ్వ చిన్న గడ్డి ఎద్దుని తీసుకుని పచ్చిక మైదానానికి వెళ్లింది. నూలు వడికే రాట్నాన్ని తనతో తీసికెళ్లింది.

కొండ పక్కన కూర్చుని నూలు వడుకుతూ ఉంది.

"మేత మెయ్యి! తారు వీపు చిన్న గడ్డి ఎద్దూ!" అంది.


ఆమె వడుకుతూ, వడుకుతూ ఆఖరికి జోగింది.

ఇంతలో దట్టంగా ఉన్న పెద్ద అడవిలోనుంచి ఉన్నట్టుండి ఒక ఎలుగు వచ్చింది! అది తిన్నగా ఎద్దు దగ్గరికి వెళ్ళింది.

"నువ్వెవరో చెబుతావా?" అని ఎద్దుని అడిగింది.

"తారు వీపు చిన్న గడ్డి ఎద్దుని."

"నాకు కొంచెం తారు ఇయ్యి, గడ్డి ఎద్దూ! నా డొక్కల్ని కుక్కలు చీల్చేశాయి. కొంచెం తారు పూస్తే నయం అవుతుందేమో," అని అడిగింది.



కాని గడ్డి ఎద్దు ఏం మాట్లాడకుండా ఉంది.

అప్పుడు ఎలుగుబంటికి కోపం వచ్చింది. అది గడ్డి ఎద్దును కొట్టబోయి దానికి అతుక్కుపోయింది.

ముసలవ్వ లేచి చూసింది.

"ముసలయ్యా! ముసలయ్యా! గడ్డి ఎద్దు ఎలుగుబంటిని పట్టుకుంది. గబగబా రా," అని గట్టిగా అరిచింది.

ముసలి తాత వచ్చి ఎలుగుబంటిని విడిపించి దాన్ని నేలమాళిగలో పెట్టాడు.

ఆ మర్నాడు పొద్దున్న ముసలవ్వ మళ్లీ గడ్డి ఎద్దుని పచ్చిక మైదానానికి తోలుకు వెళ్లింది. నూలు వడికే రాట్నాన్ని తనతో తీసికెళ్లింది. కొండపక్కన నూలు వడుక్కుంటూ కూర్చుంది.

"మేత మెయ్యి, చిన్న ఎద్దూ! నేను దారం వడుక్కుంటూ ఉంటా. మెయ్యి, మెయ్యి, చిన్న ఎద్దూ! నేను దారం వడుక్కుంటూ ఉండగా," అంది.

ఆమె అలా వడుకుతూ వడుకుతూ నిద్రలోకి జారిపోయింది. దట్టమైన పెద్ద అడవిలోనుంచి ఉన్నట్టుండి ఒక తోడేలు వచ్చింది. అది ఎద్దుని చూసింది.

"బాబూ తమరెవరో చెబుతారా?" అని అడిగింది.

"తారు వీపు చిన్న గడ్డి ఎద్దుని!" అని ఎద్దు చెప్పింది.

"బాగుంది. అయితే, నాకు కొంచెం తారివ్వరాదూ? నా డొక్కల్ని కుక్కలు చీరాయి."

"తీసుకో."

గడ్డి ఎద్దు డొక్కలు పట్టుకుని తోడేలు అక్కడ అతుక్కుపోయింది.

ముసలవ్వ కళ్ళు తెరిచి ముసలి తాతని పిలిచింది. ముసలి తాత వచ్చి తోడేలుని విడిపించి నేలమాళిగలో పెట్టాడు.

మూడో రోజున ముసలి అవ్వ మళ్ళీ చిన్న గడ్డి ఎద్దుని తీసుకుని పచ్చిక మీదకి వెళ్ళింది. మళ్లీ అలానే కొండపక్కన నూలు వడుకుతూ నిద్రపోయింది.

ఇంతలో ఒక నక్క పరిగెత్తుకుంటూ వచ్చి గడ్డి ఎద్దుని చూసింది. తను ఎవరో ఏమిటో అడిగింది.

"తారు వీపు చిన్న గడ్డి ఎద్దుని," అని ఎద్దు జవాబు చెప్పింది.

"అలాగా, నా బుజ్జివి కదూ! కొంచెం నాకు తారు ఇవ్వవూ? ఇదిగో చూడు, కుక్కలు నా తోలు ఒలిచేశాయి."

"తీసుకో."

నక్క తారు తీసుకోబోయి ఎద్దు డొక్కకి అతుక్కుపోయింది.

ముసలవ్వ లేచి ముసలాయన్ని పిలిచింది. ముసలాయన నక్కని నేలమాళిగలో పెట్టాడు.

దాంతో నేలమాళిగలో మూడు పోగయ్యాయి. ముసలాయన బోను తలుపు దగ్గర కూర్చుని కత్తి నూరడం మొదలుపెట్టాడు.

"దేనికి కత్తి నూరుతున్నావ్ తాతా?" అని ఎలుగుబంటి అడిగింది.

"ఎందుకా? నీ చర్మం ఒలిచి నాకూ, అవ్వకీ కోట్లు కుట్టుకుంటా."

"వద్దు వద్దు, అలా చెయ్యొద్దు ముసలాయనా! నన్ను వదిలిపెట్టు. నీకు బోలెడు తేనె తెచ్చి పెడతా," అంది ఎలుగుబంటి.

"సరే అయితే. తప్పకుండా తేవాలి మరి!"

ఆ మాటతో ఎలుగుబంటిని వదిలిపెట్టాడు తాత.

మళ్లీ తలుపు దగ్గర కూర్చుని కత్తి నూరడం మొదలుపెట్టాడు.

"దేనికి కత్తి నూరుతున్నావ్ తాతా?" అని తోడేలు అడిగింది.

"నీ చర్మం ఒలిచి శీతాకాలానికి నాకు వెచ్చని టోపీ తయారు చేసుకుంటా."

"అయ్యయ్యో! అలా చెయ్యొద్దు తాతా. నన్ను వదిలిపెట్టు. నీకు ఒక మంద గొర్రెల్ని తెచ్చి పెడతా," అంది.

"సరే కానియ్యి! మాట తప్పేవు సుమా," అన్నాడు.

దాంతో ముసలాయన తోడేలుని వదిలేశాడు. మళ్ళీ కత్తి నూరడం మొదలుపెట్టాడు.

"నీకు పుణ్యం ఉంటుంది తాతా! కత్తి ఎందుకు నూరుతున్నావో చెప్పు," అని నక్క అడిగింది.

"నీకు మంచి బొచ్చు ఉంది కదా. దాన్ని నీ చర్మంతోపాటు ఒలిచి మా ముసలమ్మకి చక్కని మెడ పట్టీ తయారు చేయిస్తా," అన్నాడు ముసలాయన.

"వద్దు వద్దు, నన్ను చంపొద్దు, ముసలాయనా. నన్ను వదిలిపెడితే నీకు మంచి కోడిపెట్టల్నీ, బాతుల్నీ తెచ్చి పెడతా," అంది నక్క.

"సరే అయితే. ఏం తెస్తావో చూద్దాం," అంటూ ముసలాయన నక్కని వదిలిపెట్టాడు.

చీకటి పడింది. రాత్రయింది. మళ్లీ తెల్లవారింది. ఇంతలో టకటక తలుపు చప్పుడైంది.

అవ్వకి మెలకువ వచ్చింది.

"ఎవరో తలుపు తడుతున్నారు, వెళ్లి చూడు ముసలాయనా," అంది ముసలవ్వ. ముసలాయన తలుపు తెరిచి చూశాడు. ఎలుగుబంటి పెద్ద తేనె తుట్టెతో ఎదురుగా కనిపించింది.

ముసలాయన తేనె తీసుకుని దాచేశాడు. ఇంతలో మళ్లీ తలుపు చప్పుడైంది.

ముసలాయన తలుపు తెరిచి చూశాడు. తోడేలు ఒక గొర్రెల మందని తోలుకు వచ్చింది. తర్వాత కొంచెం సేపట్లోనే కోడిపెట్టల్నీ, బాతుల్నీ, వేరే రకాల పిట్టల్నీ పట్టుకుని వచ్చింది నక్క.

అవ్వా, తాతల సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది.





# ఆశపోతు అవ్వ

అనగా అనగా ఒక తాతా, అవ్వా ఉండేవాళ్లు. వాళ్లు చాలా బీదవాళ్లు.

"ఒకసారి అడవికి వెళ్లిరండి. ఒక కానుగ చెట్టుని కొట్టుకొస్తే ఇంటిని వెచ్చబరచుకోడానికి తగిన వంట చెరకు ఉంటుంది," అని భర్తతో అంది అవ్వ.

"అలాగే," అన్నాడు ఆమె భర్త. ఒక గొడ్డలి తీసుకుని అడవికి వెళ్లాడు.

అడవిలో కొట్టడానికి సరిపోయే కానుగ చెట్టును చూసుకున్నాడు. చెట్టును కొట్టడానికి గొడ్డలిని ఎత్తగానే ఆ చెట్టు మానవ భాషలో:

"నన్ను కొట్టకు, నీకు పుణ్యం ఉంటుంది. నీకు ఏదైనా కష్టం కలిగితే సాయం చేస్తాను," అంది.

ఆ తాత భయపడి ఎత్తిన గొడ్డలిని కిందికి దించాడు. కొంతసేపు ఏమీ మాట్లాడకుండా అలా నిలబడిపోయి చివరికి ఇంటి ముఖం పట్టాడు.

ఇంటికి వెళ్లి అడవిలో జరిగినది పూసగుచ్చినట్టు భార్యతో చెప్పాడు.

"ఎంత తెలివితక్కువవాడివి! తొందరగా ఆ కానుగ చెట్టు దగ్గరకి వెళ్లి ఒక గుర్రాన్నీ, ఒక బండినీ ఇమ్మని అడగండి. మన జీవితమంతా నడకే సరిపోయే. ఇక బండిలో తిరగొచ్చు," అంది.

"అలాగే," అని తాత టోపీ పెట్టుకొని మళ్లీ అడవికి వెళ్ళాడు.

కానుగ చెట్టు దగ్గరకి వెళ్లి, "చెట్టుగారూ! మాకు ఒక గుర్రాన్నీ, బండినీ ఇమ్మని మా ఆవిడ అడిగింది. ఇవ్వండి," అన్నాడు.

"అలాగే, ఇంటికి వెళ్లు," అంది చెట్టు.



తాత ఇంటికి తిరిగి వెళ్లాడు. ఇంటి దగ్గర ఒక బండి తయారుగా ఉంది, దానికి ఒక గుర్రం కట్టి ఉంది.

"ఇప్పుడు మనం మనుషులుగా బతకవచ్చు. కానీ మన ఇల్లు ఎంత పాతదో చూడండి. ఏ రోజుకారోజు కూలిపోతుందేమోననే భయమే. కొత్త ఇంటిని ఇమ్మని చెట్టును అడగండి. ఇస్తుందేమో," అంది అవ్వ.

తాత ఆ చెట్టు దగ్గరికి మళ్లీ వెళ్లి కొత్త ఇల్లు కావాలని అడిగాడు.

"అలాగే, ఇంటికి వెళ్లు," అంది కానుగ చెట్టు.

తాత ఇంటికి వెళ్లి చూస్తే ఏముంది? అతడే తన ఇంటిని గుర్తు పట్టలేకపోయాడు. అతడి పాత ఇంటి స్థానంలో నాజూకైన కొత్త ఇల్లు ఉంది. మొగుడూ పెళ్లాలిద్దరూ చంటిపిల్లల్లా సంబరపడ్డారు.

"ముసలాయనా! మనకి గొడ్డూగోదా, కోళ్లూ, బాతులూ ఉంటే ఇక ఏం అక్కర్లేదు కదా," అని అవ్వ అంది.

తాత కానుగ చెట్టు దగ్గరికి వెళ్లి గొడ్డూగోదా ఇమ్మని అడిగాడు.

"అలాగే, ఇంటికి వెళ్లు," అంది చెట్టు.

తాత ఇంటికి వెళ్లాడు. పెరటినిండా ఆవులూ, గేదెలూ, కోళ్లూ, బాతులూ ఎక్కడ పడితే అక్కడ ఉన్నాయి. ఎంతో సంతోషపడ్డాడు తాత.

"ఇక మనకు ఏమీ అక్కర్లేదులే," అన్నాడు.

"అట్లా కాదు, ముసలాయనా. ఇప్పుడు వెళ్లి కొంచెం డబ్బు అడుగు," అంది అవ్వ.

తాత చెట్టు దగ్గరికి వెళ్లి కొంచెం డబ్బు ఇమ్మని అడిగాడు.

"అలాగే. ఇంటికి వెళ్లు," అంది చెట్టు.

తాత ఇంటికి తిరిగి వచ్చాడు. బల్ల దగ్గర కూర్చుని, బంగారపు నాణాలు లెక్కపెడుతూ వాటిని కుప్పలు కుప్పలుగా పోగు పెడుతోంది అవ్వ.

"చూడు, ఇప్పుడు ఎంత ధనవంతులం అయ్యామో!" అంది. "కాని ఇంకొకటి కావాలి. మనల్ని చూస్తే లోకులు భయపడాలి. మనం ధనవంతులం కదా! చెట్టు దగ్గరకి వెళ్లి లోకులందరూ మనల్ని చూస్తే భయపడేటట్టు చేయమని అడగండి."

తాత చెట్టు దగ్గరకి వెళ్లి అలా చెయ్యమని అడిగాడు.

"అలాగే. ఇంటికి వెళ్లు," చెట్టు అంది.

తాత ఇంటికి తిరిగి వచ్చాడు. చుట్టూ సైన్యాలున్నాయి. సైనికులు వాళ్లను కాపలాకాస్తూ ఉన్నారు. కాని అవ్వకి ఇది కూడా చాలలేదు.

“ముసలాయనా! ఇప్పుడు గ్రామంలో అందరూ మనకి బానిసలు అవ్వాలి. ఇప్పుడు మనకి అంతా ఉంది కానీ, ఇదొక్కటే మిగిలింది.”

తాత చెట్టు దగ్గరికి మళ్లీ వెళ్ళాడు. అలా చెయ్యమని అడిగాడు. చెట్టు చాలా సేపు ఏమీ బదులు చెప్పలేదు.

“ఇంటికి వెళ్లు. ఈ ఆఖరిదాన్ని మాత్రం చేస్తాను,” అని చివరికి అంది.

తాత ఇంటికి వచ్చాడు. చూస్తే అక్కడ ఏమీ లేదు. అదే పాత ఇల్లు, ఇంటి పక్కనే చింకి బట్టలతో అవ్వ.



# పెంపుడు తండ్రి

అనగా అనగా ముగ్గురు అన్నదమ్ములు ఉండేవాళ్లు. వాళ్ల చిన్నతనంలోనే తల్లీ, తండ్రీ చనిపోయారు. వాళ్లకి ఏమీ లేకపోయింది. ఒక ఇల్లు కానీ, పొలం కానీ వాళ్లకి లేవు. ఎక్కడైనా పని దొరుకుతుందేమోనని వాళ్లు బయలుదేరారు. తెల్లని బారు గడ్డం ఉన్న ఒక ముసలాయన వాళ్లకి కనిపించాడు.

"ఎక్కడి దాకా ప్రయాణం, బాబులూ," అని ఆ ముసలాయన అడిగాడు.

"మమ్మల్ని ఎవరైనా పొలం పనులకి పెట్టుకుంటారేమోనని వెతుక్కుంటూ పోతున్నాం, తాతా!" అని వాళ్లు జవాబు చెప్పారు.

"మీకు సొంత పొలం లేదా ఏమిటి?"

"మాకు అంత భాగ్యమా! మమ్మల్ని ఎవరైనా పనిలో పెట్టుకుంటే మేం ఒళ్లువంచి పనిచేసి ఆయన్నే మా తండ్రిలాగా చూసుకుంటాం."

"మీకు కావల్సింది అదే అయితే నేనే మీకు తండ్రిలాగా ఉంటాను. మిమ్మల్ని చక్కని వాళ్లలా తయారు చేసి మంచి బుద్ధులు నేర్పుతాను," అన్నాడు తాత.

ఆ అన్నదమ్ములు అతనితో వెళ్లారు. దట్టమైన అడవులు, విశాలమైన పొలాలు దాటుకుని వాళ్లు ముచ్చటైన చిన్న ఇల్లు ఉన్న చోటుకి చేరారు. ఆ ఇంటి చుట్టూ మామిడి తోట ఉంది. అక్కడ ఎటు చూసినా పువ్వులు కంటికి నదురుగా ఉన్నాయి. వాళ్లు అక్కడ నుంచుని ఉండగానే పువ్వులాగా అందంగా ఉన్న ఒక అమ్మాయి ఇంట్లోనుంచి బయటకు వచ్చింది.

ఆమెని చూసిన పెద్దన్న,

"ఆ అమ్మాయి భార్య అయి, ఒక సొంత మడి చెక్క, పాడి పశువులు ఉంటే ఎంత బాగుండును," అన్నాడు.



"నీకు అలా మనసుగా ఉంటే, అలాగే నాయనా. మనం సంబంధం కుదుర్చుకుందాం. నీకో భార్య వస్తుంది. సొంత పొలం వస్తుంది. నీకు సంతోషం కలిగించేవి అన్నీ వస్తాయి. కాని ఒక్క విషయం గుర్తుంచుకో. నువ్వు మాత్రం ధర్మపథం తప్పకూడదు," అని తాత అన్నాడు.

వాళ్లు ఆ సంబంధం కోసం వెళ్లారు. పెద్దన్నకి పెళ్లి అయ్యింది. షడ్రసోపేతమైన విందు భోజనాలు, వేడుకలు అయ్యాయి. అతను అత్తవారింట్లో స్థిరపడి, వ్యవసాయం మొదలుపెట్టాడు.

తాతా, మిగిలిన ఇద్దరు అన్నదమ్ములూ తిరిగి ప్రయాణం మొదలుపెట్టారు. కొంతసేపటికి వాళ్లకి ధగ ధగ మెరిసే ఒక ఇల్లు కనిపించింది. ఆ ఇంటికి ఆనుకుని ధాన్యంమర, చెరువు ఉన్నాయి. ఆ ఇంటి పక్కన ఒక ముచ్చటైన అమ్మాయి ఉంది. ఆమె ఏదో చేస్తోంది. అప్పుడు రెండో అన్న ఆమెని చూసి,

"ఈ అమ్మాయి భార్య అయి, ఈ ధాన్యంమర, చెరువు ఉంటే ఎంత హాయిగా ఉంటుంది! ధాన్యంమర ధాన్యం ఆడితే నాకు కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర ఉంటాయి," అన్నాడు.

"నీకు అదే మనసుగా ఉంటే అలాగే జరుగుతాయి," అని తాత అన్నాడు.

వాళ్లు ఆ ఇంటికి వెళ్లి సంబంధం కుదుర్చుకున్నారు. పెళ్లి అయింది. రెండవ అన్న భార్యతో కాపురం చెయ్యడం మొదలుపెట్టాడు.

"హాయిగా జీవించండి. ధర్మం మరిచిపోవద్దు," అని తాత చెప్పాడు.

తరవాత ఆఖరివాడూ, తాతా ముందుకు వెళ్లారు. వాళ్లకి ఒక పేద ఇల్లు కనిపించింది. ఆ ఇంట్లోనుంచి ఒక అందమైన అమ్మాయి బయటకి వచ్చింది. కాని ఆమె బట్టలు చూస్తే చాలా పేదదానిలా కనిపించింది. మూడవవాడు,

"ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుని, మేం ఇద్దరూ కలిసి కష్టపడి పని చేసి సంసారయాత్ర సాగిస్తే హాయిగా ఉంటుంది. బీదవాళ్లని మరచిపోకుండా ఉంటాం. బీదసాదలకి మాకు ఉన్నది కాస్త పెడతాం," అన్నాడు.

"నీకు మనసుగా ఉంటే అలాగే జరుగుతుంది. నువ్వు మాత్రం ధర్మపథం తప్పకూడదు," అని తాత అన్నాడు.

మూడవ వాడికి పెళ్లయ్యాక తాత తన దారిన వెళ్లిపోయాడు.

అలా అన్నదమ్ములు ఎవరి బతుకులు వాళ్లు బతుకుతూ ఉన్నారు. మొదటివాడు చాలా ధనవంతుడు అయ్యాడు. కొత్త ఇల్లు కట్టుకున్నాడు. డబ్బు మూట కట్టాడు. ఇంకా ఇంకా సంపాదించడం గురించే ఆలోచించేవాడు. కాని పేదవాళ్లకి పట్టెడు మెతుకులు పెట్టేవాడు కాదు. చాలా లోభిగా ఉండేవాడు.

రెండోవాడి స్థితి మొదటివాడి కంటే కొంచెం తక్కువగా ఉన్నా మొత్తం మీద మెరుగ్గానే ఉన్నాడు. అతడు పని చెయ్యకుండా కూలీలతో పని చేయించుకుని శుభ్రంగా తిని, తాగి కాలక్షేపం చేసేవాడు. అందరికీ అన్నీ పురమాయించేవాడు.

మూడోవాడు సామాన్యంగా సంసారం సాగిస్తున్నాడు. అతనికి ఉన్న తృణమో, పణమో బీదాబిక్కీకి ఇచ్చేవాడు. అతడి ఇంట్లో ఏమీ లేకపోయినా అయ్యో అని అనుకునేవాడు కాదు.

ఆ తాత దేశాటనచేస్తూ తన పెంపుడు కొడుకులు ఎలా ఉంటున్నారో, ధర్మంగా ఉన్నారో లేదో చూడ్డానికి బయలుదేరాడు.

ముష్టివాడి వేషంలో పెద్దన్న దగ్గరికి వెళ్లాడు. భిక్షం అడిగాడు.

"ముసలివాడిని! ధర్మంచెయ్యి బాబూ," అన్నాడు.

"అంత ముసలి తొక్కువి కాదు. వేషాలు వెయ్యకు. కావాలంటే పని చెయ్యగలవు," అని కసిరి కొట్టాడు అన్న.

తాత ఏమీ అనకుండా వెళ్లిపోయాడు. కొంచెం దూరం వెళ్లి వెనక్కి తిరిగి చూశాడు. మొదటివాడి ఇల్లూ, ఆస్తీ మంటలకి ఆహుతైపోయాయి.

తాత ఆగలేదు. మధ్య వాడిని చూడ్డానికి వెళ్లాడు. అతనికి ఇప్పుడు ధాన్యంమర కాక సుక్షేత్రమైన పొలం కూడా ఉంది. తాత అతన్ని ధాన్యంమర దగ్గర చూశాడు. నమస్కారం చేశాడు.

"అయ్యా, ధర్మ ప్రభువులు! ఈ బీద ముసలాడికి ఒక పిడికెడు గింజలు ఇప్పించండయ్యా! ఆకలిగా ఉంది, జబ్బు చేసింది," అన్నాడు.

"నాకే సరిగా తింటానికి లేకపోతే ముష్టి ఒకటా! నీలాంటి జులాయి తిరుగుబోతులు ఎంతోమంది వస్తూనే ఉంటారు. అందరికీ ముద్ద పెడుతూ ఉంటే నా పని అయినట్టే," అన్నాడు.

తాత వెళ్లిపోయాడు. కొంచెం దూరం వెళ్లి వెనక్కి చూశాడు. ఇల్లు, ధాన్యంమర నిప్పంటుకుని పొగలు లేచాయి.

ముష్టివాడి వేషంతోనే తాత ఆఖరి తమ్ముడిని చూడ్డానికి వెళ్లాడు. అతను చాలా సంసారపక్షంగా బతుకుతున్నాడు. అతని ఇల్లు శుభ్రంగా, అద్దంలా ఉంది కానీ చిన్నది, బీదగా ఉంది.

"అయ్యా! ధర్మ ప్రభువులు! ఒక రొట్టె ముక్క పెట్టించండయ్యా," అన్నాడు తాత.

"లోపలికి రా తాతా. నీకు తినడానికి పెడతాం, కొంచెం మూట కట్టుకుని వెళుదువుగాని," అన్నాడు ఆఖరి తమ్ముడు.

తాత లోపలికి వెళ్లాడు. ఆయన చింకి పాతలు చూసి ఆఖరి తమ్ముడి భార్య అయ్యో పాపం అనుకుని కట్టుకోవడానికి బట్టలు ఇచ్చింది. ఆయన బట్టలు తొడుక్కుంటూ ఉండగా, గుండెలమీద పచ్చిగాయం ఆఖరి తమ్ముడికీ, అతని భార్యకీ కనిపించింది. తాతకి భోజనం వడ్డించేటప్పుడు అదేమిటని వాళ్లు అడిగారు.

"మీ దగ్గర దాపరికం ఎందుకు నాకు. అయినా నేను ఎక్కువ కాలం ఉంటానని అనుకోను," అన్నాడు తాత.

"ఏమన్నా చెయ్యవచ్చా?" అని వాళ్లు అడిగారు.

"ఆఁ! ఎవరైనా సాయపడగలరు. కాని ఎవరూ సాయం చెయ్యడం లేదు."

"ఎందుకని? ఏం చెయ్యాలో చెపితే మేం చేస్తాం," అని ఆఖరి తమ్ముడు అన్నాడు.

"ఊ, ఏముంది. పూచిక పుల్లతో సహా అలాగే ఉంచేసి ఇంటిని దగ్ధం చేసి, ఈ గాయం మీద ఆ బూడిదని చల్లాలి. అది తప్ప ఇంక వేరే మందు లేదు. అంత నష్టం పెట్టుకుని నా జీవితాన్ని ఎవరు కాపాడతారు?" అన్నాడు తాత.

ఆఖరి తమ్ముడు మౌనంగా ఉండిపోయాడు. చాలాసేపు ఆలోచించి అప్పుడు భార్యకేసి తిరిగాడు.

"ఏమంటావ్?" అని అడిగాడు.

"మనం కొత్త ఇంటిని ఎప్పుడైనా కట్టుకోవచ్చు. కాని ఒక మనిషి చనిపోతే మళ్లీ బతికించగలమా?" అందామె.

"సరే, ఇక ఇంతకంటే చెప్పవలసింది ఏమీ లేదు."

వాళ్లు పిల్లల్ని ఇంటిలోనుంచి బయటికి తీసికెళ్లారు. ఆఖరి తమ్ముడు ఇంటికేసి చూశాడు. ఇంటిని పోగొట్టుకోవడం అతనికి బాధగానే ఉంది. కాని తాత పట్ల జాలి చాలా ఎక్కువగా ఉంది. అందుకని ఒక కట్టెని మండించి గడ్డి చూరుకి ముట్టించాడు.

ఇంటికి నిప్పు అంటుకుంది. జ్వాలలు నాలుకలు చాస్తూ ఇంటిని ఆహుతి చేశాయి. కాని అది దగ్ధం అయిందో లేదో దాని స్థానంలో ఇంకా పెద్దదీ, ఐశ్వర్యంతో ఉన్నదీ మరో ఇల్లు అక్కడ ప్రత్యక్షమైంది.

ఆ తాత చిరునవ్వు నవ్వాడు.

"కనిపెట్టాను నాయనా, మీ అన్నదమ్ముల్లో ధర్మం అంటే ఏమిటో తెలిసిన వాడివి నువ్వొక్కడివే. నువ్వు సదా సిరి సంపదలతో తులతూగాలని కోరుతున్నాను," అన్నాడు తాత.

ముష్టివాడు అనుకున్న అతను మరెవరో కాదనీ తమ పెంపుడు తండ్రి అనీ, ఆఖరి తమ్ముడు గ్రహించాడు. గబగబా తాత దగ్గరికి పరిగెత్తాడు కాని ఆయన అదృశ్యం అయిపోయి మరి ఎన్నటికీ కనిపించలేదు.





ISBN 978-93-80153-56-8
9 789380 153568
మంచి పుస్తకం